బిజుగుడలో వైద్యశిబిరం

- 'ప్రజాశక్తి' కథనానికి అధికారుల స్పందన

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ బిజుగుడలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. బిజుగుడ గ్రామంలో విషజ్వరాలు విజృంభించడంతో గిరిజనులు అనారోగ్యంతో పడుతున్న ఇబ్బందులపై మంగళవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక వైద్యబృందం గ్రామాన్ని సందర్శించి వైద్యశిబిరం నిర్వహించి, జ్వరపీడితులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఆరోగ్య సూచనలు చేశారు.

రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

దంచికొట్టిన వాన

- తడిసి ముద్దయిన అల్లూరి జిల్లా
- ఉప్పొంగిన కొండవాగులు,గెడ్డలు
- పలుచోట్ల స్తంభించిన రాకపోకలు
- సాధారణ జీవనానికి జనం అవస్థలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో వాన దంచికొట్టింది. మంగళవారం ఉదయం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కురిసిన వర్షంతో ఏజెన్సీలోని ఆయా ప్రాంతాల్లో వాగుల్లో వరద ఉధతి పెరగడంతో పలుమార్గల్లో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పాడేరు డివిజన్ లోని ఆయా మండలాల్లోను భారీ వర్షాలు కురువడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రాలలో జనసంచారం తక్కువైంది. పలు ప్రాంతాల్లో సంతలకు వచ్చిన గిరిజనులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడ్డారు. ఏజెన్సీలోని అన్ని ప్రధాన గెడ్డలు, వాగులలో వరద ఉధతి నెలకొంది. జిల్లాలో ఆయా మండలాల్లోని గెడ్డలు, వాగులలో వరద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో మారుమూల గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలను దాటి ప్రయాణం చేసేందుకు గిరిజనులు భయపడుతున్నారు.

కర్ల పాదర్ వద్ద జనం కష్టాలు

ముంచింగిపుట్టు: మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండవాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అతిమారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం పంచాయతీ కర్లపొదోర్ గ్రామ వద్ద గెడ్డపై వంతెన లేకపోవడం, అక్కడ గెడ్డనీరు తాత్కాలిక మార్గంపైనుంచి ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు వాహనదారుల, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కర్లపొదరు గ్రామ సమీపంలో అత్తికాల్, పిల్ల గండువా, జరేల పొద్దోర్, నువ్వగుడ తదితర 5 గ్రామాలలో జనం బిక్కుబిక్కుమంటూగడపాల్సి వచ్చింది. వంతెన లేక తాము పడుతున్న ఇక్కట్లపై పలుమార్లు కలెక్టర్, పిఒ, ఇతర అధికారులతోపాటు నేతల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించకపోవడంతో వర్షాల సీజన్‌లో తాము ఇలా ఇబ్బందులు పడక తప్పడం లేదని లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హుకుంపేట: మండలంలోని పలు ప్రాంతాల్లో

ముంచంగిపుట్ట మండలం కర్ల పొదర్ బ్రిడ్జి వద్ద ఉధృతంగా గెడ్డ

మంగళవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల సమయం వరకు ఏకధాటిగా 7గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షాలకు ఒంటిపాక, పెద్దగరువు. మసాడ వద్ద కల్వర్టులు మీదుగా వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒంటిపాక నుండి పట్టాం, గత్తుం, అనంతగిరి మండలం వేంగడ, పైనంపాడు తదితర పంచాయతీ గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు..పెద్దగరువు మసాడ దగ్గర నూతనంగా నిర్మిస్తున్న వంతెన వద్ద డైవర్షన్ పైనుంచి నీరు అధికంగా ప్రవర్తిస్తుండంతో అరుకువేలి నుంచి పాడేరు మధ్య వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం ఐదుగంటల దాటినా ప్రధానరోడ్డుపై గెడ్డల ఉధృతి తగ్గకపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

పాడేరు, అరకు మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

మండలాల వారీగా జిల్లాలో వర్షపాతం

పాడేరు : అల్లూరి జిల్లాలో మండలాల వారీగామంగళవారం నమోదైన వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో ఇలా ఉన్నాయి. ఎటపాక మండలంలో1.9 మిల్లీమీటర్లు, కూనవరం 2.4, చింతూరు 30.6, వర రామచంద్రపురం 1.4, ముంచంగిపుట్టు 63.5, పెదబయలు 48.3, డుంబ్రిగుడ 26.1. అరకు వ్యాలీ 9.7, అనంతగిరి 13.9, హుకుంపేట 2.3, పాడేరు 0.5, జి మాడుగుల 4.2, చింతపల్లి 1.5, జీకే వీధి 2.4, కొయ్యూరు 1.9, మారేడుమిల్లి 16.1, దేవీపట్నం0.3, వై రామవరం 7.4, అడ్డతీగల 10.1, రాజవొమ్మంగి 1.1, గంగవరం 17.1, రంపచోడవరం 6.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది జిల్లాలో ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది.

పెదబయలులో పాఠశాలలోకి చొరబడిన వర్షపు నీరు

పాఠశాలలు, హాస్టళ్లలోకి వర్షపునీరు

పెదబయలు: మండలంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీవర్షానికి జనజీవనం స్తంభించింది పాఠశాల, వసతి గృహాల్లో నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు విద్యుత్‌కు అంతరాయం తో బయోమెట్రిక్‌కు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మెయిన్‌రోడ్డు లో డ్రైనేజీ లేకపోవడంతో చెత్తచెదారం రోడ్డుపైకి, అక్కడి నుంచి ఇళ్లల్లోకి కూడా చేరింది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.

వర్షాలకు కొట్టుకుపోయిన చెలిమరవలస రోడ్డు.

డుంబ్రిగుడ: భారీ వర్షాలకు మండలంలోని పోతంగి పంచాయతీ చెలిమరవలస, రంగినివలస మధ్య రోడ్డు కొట్టుకుపోవడంతో రంగినివలస, కొంతినివలస నుంచి మండలకేంద్రానికి రాకపోకలు పూర్తిగా స్తంభించుకు పోయాయి. ఈ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం పంచాయతీ ఎన్నికల్లో అధికారులు శంకుస్థాపన చేసినా, ఇప్పటివరకు పనులు చేపట్టలేదు.కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాకపోకలు స్తంభించడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జి. మాడుగుల : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బొయితిలి పంచాయతీ మద్ది గరువు గ్రామ సమీపంలో కొండగడ్డ వంతెన వరద ఉధృతికి మంగళవారం కొట్టుకుపోయింది. దీంతో పలుగ్రామాలకు రాకపోకలు నిలిచి, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుండపోత వర్షంతో మంగళవారం జి.మాడుగుల వారపు సంతకు వచ్చిన గిరిజనులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

జరిసింగి బడి జలమయం

పెదబయలు రూరల్: మంగళవారం కురిసిన కుండపోత వర్షానికి పెదబయలు మండలం, పోయిపల్లి పంచాయతీ, జరిసింగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిలువనీడ లేని పరిస్థితిలో నీరు చేరి జలమయమైంది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఐదేళ్లుగా పక్కా భవనం లేని పరిస్థితుల్లో ప్రస్తుతమున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం, చొరవతో పైకప్పు రేకులతో, చుట్టూ టార్పాలిన్లు వేసి తాత్కాలిక పాకను నిర్మించి అందులో పాఠశాలను నిర్వహిస్తున్నారు. మామూలు వర్షానికి పాఠశాల వద్ద ఇబ్బంది లేకపోయినా, మంగళవారం కురిసిన కుండపోతవర్షానికి జరసింగి పాఠశాలలోకి నీరు చొరబడి నిలువ నీడ లేనంతగా చిత్తడి మారింది. ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు కూర్చొనేందుకు చిన్న కుర్చీలను ఏర్పాటు చేసినప్పటికీ, పైనుంచి, చుట్టుపక్కల నుంచి వర్షపు తుంపరలు పాఠశాలలోకి చొరబడడంతో తడిసిపోతూ విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత పరిస్థితి చూసైనా జరసింగి పాఠశాలకు పక్కా భవనం నిర్మాణానికి అధికారులు చొరవ చూపాలని విద్యార్థుల తల్లి దండ్రులు జరిసింగి.రామ్మోహనరావు జె.శివప్రసాద్ జె.సింహాచలం, జె.శ్రీకాంత్, లక్ష్మీ నాయుడు, మల్లేష్ తదితరులు వేడుకుంటున్నారు.

వర్షంతో తాత్కాలిక పాకలో జరిసింగి పాఠశాల విద్యార్థుల అవస్థలు

నకిలీ కుల ధ్రువీకరణపై విచారణ

ఆధారాల్లేకుండా హాజరైన బాధ్యుడు : 20వ తేదీకి వాయిదా

ఐటిడిఎ పిఒ, కలెక్టర్ సిసి ఒత్తిడితోనే ఇచ్చినట్లు విఆర్ఒ వివరణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గిరిజనేతరుడికి నకిలీ కులధ్రువీకరణ పత్రాల జారీపై ఆదివాసీ గిరిజన సంఘం నేతల ఫిర్యాదు మేరకు మంగళవారం నిర్వహించిన దర్యాప్తు తూతూమంత్రంగా సాగిందని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. మంగళవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో విచారణకు హాజరైన ఎస్‌టి నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందిన పిట్టల రాంబాబు, ఎటువంటి ఆధారాలు, డాక్యుమెంట్లు లేకుండా విచారణకు హాజరయ్యారు. దీంతో ఈనెల 20న అన్ని డాక్యుమెంట్స్ తో హాజరు కావాలని గడువు ఇచ్చారు. కాగాగిరిజనేతరుడైన పిట్టల రాంబాబుకు జారీ చేసిన నకిలీ ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రంపై పాడేరు ఐటిడిఎ పిఒ, జిల్లా కలెక్టర్ సీసీల ఒత్తిడితో కుల ధ్రువీకరణపత్రం జారీ చేసినట్టు సంబంధిత విఆర్ఒ విచారణలో తెలిపారు. పిట్టల రాంబాబు విచారణ చేయగా, తన తల్లిదండ్రులది ఏ కులమో తనకు తెలియదని పొంతన లేని సమాధానం చెప్పారని చెప్పినట్లు తెలుస్తోంది. అధికారులకు ముడుపులు చెల్లించి ఎస్‌టి భగతా కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్నానని తెలిపారు.

విచారిస్తున్న తహశీల్దార్ వేణుగోపాల్

బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

అరకు రూరల్ : గిరిజనేతరుడైన పిట్టలా రాంబాబుకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం జారీపై తూతుమంత్రంగా విచారణ జరిపి, చర్యలు తీసుకోవలసిన మండల తహశీల్దార్ మరో వారం రోజులు గడువు ఇవ్వడం ఆంతర్యం ఏమిటి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి బాలదేవ్ ప్రశ్నించారు. తక్షణమే నకిలీ ధ్రువీకరణ జారీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పి బాలదేవ్ మాట్లాడుతూ. నకిలీ ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రంపై ఆధారాలతో లిఖితపూర్వక ఫిర్యాదు చేసినా, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవడంలో అధికారులు అలసత్వం చూపడం దారుణమన్నారు శరభగుడకు సిబిఎం చర్చి కాలనీలో నివాసం ఉంటున్న మరో వ్యక్తి కుర్ర అక్కుల భర్త నోటోబోరో ఒడిస్సా రాష్ట్రం నుండి బతుకు తెరువు కోసం వచ్చి, ఇక్కడ స్థిరపడి ఎస్‌టి వాల్మీకి కుల ధ్రువీకరణ పత్రం పొందాడని, దానిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరకు వేలి తహశీల్దార్ ప్రమేయంతోనే ఎస్‌టి నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని, ఇటువంటి నేపథ్యంలో అతనినే విచారణ అధికారిగా ఐటిడిఎ పిఒ నియమించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులతో దర్యాప్తు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి బుజ్జి బాబు,కిల్లో జగన్నాధం, కొర్ర మగ్గన్న, కిల్లో బుజ్జి బాబు, కిల్లో డొంబు, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ఏపుగా పెరిగిన మిర్చి నారు

అదునులేక ముదురుతున్న మిరపనారు

- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి-విఆర్.పురం

విలీన మండలాల్లో 15 రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మిరప సాగుకు అదును లేకుండా పోయింది. దీంతో మిరపనారు ముదురుపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలవరం ముంపు నాలుగు మండలాల్లో రైతులు సాగు చేసే వాణిజ్య పంటల్లో మిర్చి ప్రధానమైంది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి మిర్చి పంటను రైతులు సాగు చేస్తున్నారు. జులైలో వచ్చిన వరదలు అనంతరం రైతులు మిర్చి నారు వేశారు. నారు వేసిన 40 రోజుల లోపు ఉడుపు చేయాల్సి ఉంది. ఇప్పటికే మిర్చి నారు వయస్సు 50 రోజులు దాటింది. మిర్చి నారు ఉడుపు చేసేటప్పుడు పొలం పొడిగా ఉండాలి. కాని 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిర్చి ఉడుపునకు పొలం అనుకూలంగా లేదు. చివరి దుక్కులు చేయడానికి వీల్లేకుండా ఉంది. మరో వైపు 50 రోజులు దాటిపోవడంతో మిర్చినారు ముదురుపోతుంది. నారు ముదురుపోయిన తరువాత దానిని నాటినా దిగుబడి అంతంత మాత్రమే ఉంటుంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో నారుమడులకు చీడపీడలు ఆశించకుండా కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి మిర్చి సాగుకు సన్నద్ధం చేయగా, అదునులేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

పలువురికి గాయాలు

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం ఫోర్‌బై గ్రామం సమీపంలో విశాఖపట్నం మధురవాడ డిపోకు చెందిన ఆర్టీసీ లగ్జరీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. విశాఖపట్నం నుండి భద్రాచలం వెళ్తుండగా, మంగళవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా, పదిమందికి గాయాలయ్యాయి. వారిని అటువైపు వెళుతున్న మరో బస్సులో డొంకరాయి ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మోతుగూడెం పోలీసులు ప్రమాదం ఎలా జరిగిందో పరిశీలించారు.

బోల్తా పడిన ఆర్‌టిసి బస్సు

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పర్యటన నేపథ్యంలో

టిడిపి నాయకుల గృహ నిర్బంధం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మంగళవారం మండల పర్యటన నేపథ్యంలో పోలీసులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా మండలంలోని టిడిపి నాయకులను గృహ నిర్బంధం చేశారు. మండలానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వస్తున్నారని సమాచారంతో పోలీసులు టిడిపి మండల అధ్యక్షుడు గురుకు శేషు కుమార్‌తో పాటు మరికొంత మందిని హౌస్ అరెస్టు చేశారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టిడిపి నేతలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని అడ్డుకుంటారన్న అనుమానంతో పోలీసులు అప్రమత్తమై గృహ నిర్బంధానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా టిడిపి నేత గురుకు శేషు కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను ఈ ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచివేస్తుందన్నారు. మండలంలో ఏ ఒక్క రహదారి కూడా వైసిపి ప్రభుత్వం వేయలేదని, గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన రోడ్లకు మరల శంకుస్థాపన చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలో చాలామంది గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఒక్క నిర్మాణం కూడా చేయలేదన్నారు. ఖాళీ కాగితాలను చేతులో పెట్టి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. వర్షాకాలం కావడంతో అనేక గ్రామాల్లో గిరిజనులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు పెట్టడం లేదన్నారు. గ్రామాల్లో ఎఎన్ఎంలు లేకపోవడంతో రోగులకు కనీస వైద్యం అందని పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. మారేడుమిల్లి ప్రధాన ఆరోగ్య కేంద్రంలో కూడా సరైన మందులు లేవని, దీంతో గిరిజనులు బయట ఉన్న ఆర్ఎంపి డాక్టర్ల వద్దకు క్యూ కడుతున్నారని తెలిపారు.

టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషుకుమార్‌ను గృహ నిర్బందం చేసిన పోలీసులు

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని పలు రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్సీ అనంతబాబు, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి మంగళవారం శంకుస్థాపనలు చేశారు. తాడేపల్లి పంచాయతీ పరిధి గురుమామిడి నుండి తాడేపల్లి గ్రామం వరకు మూడు కిలోమీటర్ల మేర కోటి 15 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి, కెవి.లంక నుండి టేకుల వీధి వరకు రూ.50 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి, నీలవరం నుండి గాలిగోపురం వరకు మూడు కిలోమీటర్ల మేర కోటి 50 లక్షల రూపాయలతో డబ్ల్యుబిఎం రోడ్డు, తాడేపల్లి నుండి వేటుకూరు గ్రామం వరకు నాలుగు కిలోమీటర్ల మేర కోటి 20 లక్షల రూపాయలతో డబ్ల్యుబిఎం రోడ్డు, సున్నంపాడు పంచాయతీ పరిధి సున్నంపాడు నుండి నూరుపూడి గ్రామానికి ఐదు కిలోమీటర్ల మేర రూ.3.50 కోట్లతో బీటీ రోడ్డు, కుండాడ పంచాయతీ పరిధి జిఎం వలస జంక్షన్ నుండి కుండాడ గ్రామానికి మూడు కిలోమీటర్లు మేర కోటి 30 లక్షల రూపాయలతో బీటీ రోడ్డుకు, వేటుకూరు పంచాయతీ పరిధి వేటుకూరు నుండి దేవుడు లంకలు గ్రామానికి రెండు కిలోమీటర్ల మేర రూ.65 లక్షలతో డబ్ల్యుబిఎం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.

నూతన పింఛన్ల పంపిణీ

మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మారేడుమిల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నూతనంగా 83 మందికి కొత్త పింఛన్లు అందించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత కుమారి, జెడ్పిటిసి బాలాజీ బాబు, వైసిపి మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ, పలువురు ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

పిచ్చి కుక్క దాడిలో గాయపడిన బాధితులు

పిచ్చి కుక్క స్వైర విహారం

12 మందికి గాయాలు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరంలో మంగళవారం సాయంత్రం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో సీతంశెట్టి నగర్, ఎస్‌టి.కాలనీ, వాల్మీకి పేటల్లో కలియ తిరిగింది. కనిపించిన వారిని కనిపించినట్లే మీద పడి గాయపరిచింది. చిన్న, పెద్ద, ముసలి తేడా లేకుండా కంట పడిన ప్రతి ఒక్కరినీ గాయపర్చింది. శరీరాలపై ముక్కలు ఊడినట్లు కరిచింది. పిచ్చి కుక్క దాడిలో దాదాపు పన్నెండు మంది వరకు గాయపడ్డారు. వీరిలో ఎనిమిది మంది తీవ్రంగా, నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ముగ్గురు చిన్నారులు, ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. క్షతగాత్రులను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేసి, చికిత్స అందించారు. స్థానికులు పిచ్చికుక్కని పట్టుకొని హతమార్చారు.

చదువులో ఆణిముత్యాలు అక్కచెల్లెళ్లు

ఎంబిబిఎస్ చదువుతున్న జ్యోతిర్మయి

నీట్‌లో సీటు సాధించిన దివ్య తేజస్విని

ప్రజాశక్తి-చింతూరు

చింతూరులోని ఆర్ఎంపీ వైద్యులు బందెల సాగర్, వసంత దంపతుల ఇద్దరు కుమార్తెలు చదువులో రాణిస్తున్నారు. పెద్ద కుమార్తె జ్యోతిర్మయి నాలుగేళ్ల క్రితమే ఎంబిబిఎస్ ఫ్రీ సీటు సాధించి విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువు కొనసాగిస్తోంది. రెండో కుమార్తె దివ్య తేజస్విని ఈ ఏడాది నీట్ పరీక్షల్లో 720 మార్కులకు గాను 433 మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్‌లో ఫ్రీ మెడికల్ సీటు సాధించింది. ఇద్దరు అక్క చెల్లెళ్లు ఎంబీబీఎస్ ఫ్రీ సీట్లు సాధించి వైద్య విద్యను అభ్యసించడం పట్ల చింతూరు గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులైన సాగర్, వసంతలకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చింతూరులోని ఒకే కుటుంబంలో ఇద్దరు డాక్టర్లు చదవడం చింతూరుకే గర్వకారణమని గ్రామస్తులు అంటున్నారు.

తల్లిదండ్రులు వసంత, సాగర్‌తో జ్యోతిర్మయి, దివ్య తేజస్విని



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

15లోగా ఆన్‌లైన్‌లో కొత్త ఓటర్ల నమోదు : పిఒ

ప్రజాశక్తి -పాడేరు : అరకు నియోజకవర్గ పరిధిలోని కొత్తగా ఓటు నమోదు చేసుకున్న 4272 మంది దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్ చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ ఆదేశించారు. మంగళవారం ఐటిడిఎ కార్యాలయం నుండి నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల ఎఇఆర్‌ఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతి చెందిన ఓటర్లు 6838 మంది ఉన్నారని సంబంధిత ఫారాలను ప్రాజెక్ట్ అధికారి లాగిన్‌కు పంపించాలని సూచించారు. 6,7,8 ఫారాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఆరు మండలాల పరిధిలో 6891 మంది ఓటర్లకు మార్పులు చేర్పులు చేయాల్సి ఉందన్నార. వీటికి సంబంధించి మార్పులు చేర్పుల్లో 59 శాతం పూర్తి చేశారని, మిగిలిన దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. 6838 మంది మృతి చెందిన ఓటర్లను తొలగించవలసి వుందని, ఆ ప్రక్రియ నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు.

గిరిజన ఆచార వ్యవహారాలపై సదస్సు

ప్రజాశక్తి- పాడేరు: పాడేరు మండలంలో ఆదివాసీ సంప్రదాయాలు, వారి వ్యవహారాలపై సిపిఎఫ్ సంస్థ ఆధ్వర్యం లో 19 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం పాడేరులో ఒక రోజు సదస్సు నిర్వహించారు . జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన సద గిరిజనుల సంప్రదాయాలు, వారి ఆచారాలు, సంప్రదాయాలు, వారి ఆహారపు అలవాట్లు , పండించే పంటల పై సంస్థ రిసోర్స్ పర్సన్లు విపులంగా వివరించారు. పూర్వికులు ప్రతి గ్రామంలో జొన్నలు, రాగులు, సజ్జలు, ముంతజొన్నలు, సామలు, కొర్రలు, కందులు వంటి అనేక రకాలైన పంటలు పండించే వారన్నారు. అలాగే ఆదివాసులు తమ గ్రామాలలో సంకులమ్మ, ఏకిరమ్మ, పోతురాజు వంటి దేవుళ్లను సాంప్రదాయంగా కొలిచేవారన్నారు. పండగల విషయంలో మొట్టమొదటి వండగగా కొర్రకొత్త, తరువాత జోళ్ల, ఇటుకల పండుగ, వినాయకచవితి, వంటి అనేక రకాలైన పండగలు జరుపుకునే వారన్నారు. కాలక్రమేణా నాటి పంటలు,పండుగలు, ఇతర ఆచార వ్యవహారాలన్నీ కనుమరుగై పోతున్నాయని, వాటిని పరిరక్షించి, కొనసాగించేలా ప్రస్తుత తరాన్ని చైతన్యవరపడం, జాగృతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్. రామచంద్రరావు, సిహెచ్ సరస్వతి దేవి, ఆర్గనైజేషన్ డైరెక్టర్ గాసినాయుడు, ఆర్గనైజేషన్ కోర్డినేటర్, విద్యా శాఖా మండల కోర్డినేటర్ వి. జయరాజు పాల్గొన్నారు.

నకిలీ కులధ్రువీకరణలపై చర్యలు తీసుకోండి

ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లాలో నకిలీ ఎస్‌టి కులధ్రువీకరణలతో ఉద్యోగాలు పొందిన వారిపైనా, సర్టిఫికెట్లు జారీ చేసిన వారిపైనా క్రిమినల్ చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ, కో కన్వీనర్లు సత్యనారాయణ, పాంగి చిన్నారావు, మువ్వల లక్ష్మణరావు ఆరోపించారు. అక్రమార్కులైన అధికారులు దీనికి తోడ్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. . మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన చట్టాలు, హక్కులు ఉల్లంఘించి కొంతమంది రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్న అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ఆదివాసీహక్కులను, చట్టాలను ధిక్కరించి గిరిజనేతరులు లాడ్జిలు, పెద్ద భవనాలు, వ్యాపార సముదాయాలు నిర్మాణం చేపట్టడమే కాకుండా ఇప్పుడు ఎస్‌టి కులధ్రువీకరణలు పొంది గిరిజనులకు దక్కాల్సిన ప్రయోజనాలను కాజేస్తున్నారన్నారు. ఆశ్రమ హాస్టల్ లో హెల్త్ అసిస్టెంట్ల నియమించి విద్యార్థుల మరణాలు అరికట్టాలని, ఆదివాసీలకు వంద శాతం ఉద్యోగాలు కల్పించే జిఒ 3 పునరుద్ధరించి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

సౌకర్యాలు లేక ఇబ్బందుల్లో విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీవన్

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారనిఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీవన్‌కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల విద్యార్థులు సమస్యలు తెలుసుకొన్నారు అనంతరం మాట్లాడుతూ పెదబయలు జెడ్‌పి హైస్కూల్‌లో 400 మందికిపైగా విద్యార్థులు ఉన్నప్పటికీ, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వ వైఫల్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో ఎక్కువగా గిరిజన విద్యార్థులే ఉన్నారని, వీరికి చదువు ఒకచోట, భోజనం, వసతి ఇలా వేర్వేరు చోట్ల ఉండడం వల్ల ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనానికి వెళ్లేందుకు ఇక్కట్లు పడకతప్పడం లేదన్నారు. ముఖ్యంగా వర్షాల సీజన్‌లో పాఠశాల నుంచి వసతిగృహానికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రాత్రివేళల్లో తరగతి గదుల్లోనే నిద్రించాల్సి వస్తోందన్నారు. శిథిలమైన పాతబడిన పాఠశాల భవనంలో పిచ్చులూడి పడుతున్నాయని,పాతబడిన భవనం ఎప్పుడు కూలి పడుతుందోనని భయందోళనకు గురవుతున్నారన్నారు. హాస్టల్‌కు పక్కా భవనం నిర్మించడంతోపాటు రెగ్యులర్ వార్డెన్‌ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అనేకమార్లు పాడేరు ఐటిడిఎ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. పెదబయలు హైస్కూల్, హాస్టల్ సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించాలని కోరనున్నట్లు తెలిపారు. పాఠశాలకు కేటాయించిన నాడు నేడు, మనబడి నిధులు సక్రమ వినియోగానికి దృష్టి పెట్టాలని కోరారు. అధికారులు స్పందించకుంటే పాడేరు ఐటిడిఎ ఎదుట విద్యార్థులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత జీవన్‌కృష్ణ

బాలిక బలవన్మరణ బాధ్యున్ని శిక్షించాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న మహిళా సంఘం నేతలు

ప్రజాశక్తి -హుకుంపేట: బాలికను గర్భవతిని చేసి ఆమె బలవన్మరణానికి కారణమైన పాంగి చిట్టిబాబుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అల్లూరి గిరిజన మహిళ సంఘం ప్రధాన కార్యదర్శి సొంటేన హైమావతి, అధ్యక్షురాలు కొసల్ల డిమాండ్ చేశారు. మంగళవారం దీనిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శోభకోట పంచాయతీ ఇదులుగొంది గ్రామానికి చెందిన మర్రి చంద్రిక, బొడ్డపుట్టు గ్రామానికి చెందిన పాంగి చిట్టిబాబు నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. వారి మధ్య శారీరకసంబంధం కూడా ఏర్పడిందని ఏడునెలల గర్భం దాల్చిన బాలిక, తనను పెళ్లి చేసుకోవాలని సుబ్బారావును కోరగా, అతను నిరాకరించడమే కాకుండా వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో చంద్రిక తల్లిదండ్రులు అతనను ఇంటికి తీసుకొచ్చారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రిక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక బలవన్మరణానికి కారణమైన చిట్టిబాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత కటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, లేకుంటే ఐటిడిఎ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నాసిరకం పనులతో కొట్టుకుపోయిన కల్వర్టు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని మారుమూల పంచాయితైన వనగమ్మ పంచాయతీ అసరాడ నుండి రంగబయలు పంచాయతీ పట్నుపడాల్‌పుట్, జోడిగుమ్మ గ్రామాలకు రూ.17కోట్లతో నిర్మించిన 20.6 కిలోమీటర్ల తారురోడ్డు పనుల్లో నాణ్యతాలోపం వల్ల వనుగుమ్మ గ్రామం సమీపంలో కల్వర్టు మంగళవారం వర్షానికి కోతకు గురైందని సిపిఎం మండల కమిటీ సభ్యుడు కొర్ర శంకరరావు విమర్శించారు. రెండు నెలల క్రితం ఇదే రోడ్డులో జోడిగుమ్మ సమీపంలో ఘాట్ వద్ద నాణ్యత లేని పనుల వల్ల రోడ్డు వర్షాలకు కోతక గురైందన్నారు. పదికాలాల పాటు ఉండాల్సిన రోడ్డు, ఇలా మూణ్నాళ్లకే పాడవ్వడానికి కారణమైన కాంట్రాక్టర్, పనులు పర్యవేక్షించిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోతకు గురైన కల్వర్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కోరారు.

వనుగుమ్మ గ్రామస్తులైన కే నీలకంఠం, గొల్లోరి దేవ, కే రాధాకష్ణ, నాయకం సుభాన్, గొల్లారి సోనియా గ్రామస్తులు కోతకు గురైన కల్వర్టును పరిశీలించారు.

కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న సిపిఎం నేత

రవణిని సత్కరిస్తున్న ఆదివాసీగిరిజన సంఘం నేతలు, విలేకర్లు

అంధుల క్రికెటర్ రవణికి ఘనసత్కారం

ప్రజాశక్తి - హుకుంపేట : ఇంగ్లాండులో జరిగిన ప్రపంచ అంధుల కప్ క్రికెట్‌లో విశేషంగా రాణించి, ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై విజయంలో కీలక పాత్ర పోషించిన రవణిని ఆమె స్వగ్రామమైన రంగసింగిపాడులో ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ నాయకులు, మండల పత్రిక విలేకర్లు మంగళవారం ఘనంగా సన్మానంచారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తాపుల కృష్ణారావు, గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి హైమావతి, అప్పలకొండ పడాల్ మాట్లాడారు. నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టి, దేశానికి కీర్తి ప్రతిష్టలు సాధించిపెట్టిన రవణి, ఆదివాసులకు ప్రపంచస్థాయిలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టారని కొనియాడారు. ఇంతటి విజయానికి కారణమైన రవణికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సముచిత గౌరవం దక్కకపోవడం బాధాకరమన్నారు. అదివాసులంటే పాలకులకు ఎందుకింత వివక్షత అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జాతీయ స్పోర్ట్స్ అథారిటీ ద్వారా రవణికి అన్ని రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు లక్ష్మణరావు మండల విలేకర్లు అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్,లింగమూర్తి, కనకరాజు, విలేకరి శివ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌టిఒ పనుల పేరిట మోసం

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో టీచర్స్ క్వార్టర్స్‌కు ఎదురుగా వినయ్ ఆన్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసి వాహన యజమానులకు, లైసెన్స్‌దారులకు మోసం చేసి పారిపోయిన ఆర్‌టిఎ బ్రోకర్ వినయ్‌ను పట్టుకుని అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, నాయకులు అప్పలకొండ పడాల్ డిమాండ్ చేశారు. మైదాన ప్రాంతం కోటవురట్ల మండలానికి చెందిన వినయ్, హుకుంపేటలో ఆన్‌లైన్ సెంటరు పెట్టి, గిరిజన వాహన యజమానులు, లైసెన్స్‌దారుల నుండి వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు కోసం అడ్వాన్స్ పేరుతో పెద్దమొత్తంలో వసూలు చేసి పనులు చేయలేదని బాధితులు వాపోతున్నారు. తమకు జరిగిన మోసంపై పాడేరు సిఐకి ఫిర్యాదు చేయనున్నట్టు బాధితులు తెలిపారు.

రేషన్ కార్డులు మంజూరు చేయరూ...

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని ఎగువశోభ పంచాయతీ పరిధి జాముగుడ గ్రామంలో 12 s కుటుంబాలకు రేషన్ కార్డులు లేవని సాగర .రాజు, సోమ్మెల. సుబ్బారావు ఆవేదన వ్యకతం చేశారు. గ్రామంలో సోమ్మెల. అప్పలనాయుడు, సోమ్మెల. సోమరాజు, పాంగి .చిన్నారావు, పాంగి. అప్పలరాజు సాగర. రాజు, సోమ్మెల .సుబ్బారావు, సోమ్మెల. అప్పలస్వామి, సోమ్మెల .మహేష్, సాగర. ప్రసాద్. సోమ్మెల .అప్పన్న, సాగర. కామెష్, సాగర .గణేష్‌లకు ఇప్పటివరకు ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, దీనిపై స్థానిక సచివాలయ కేంద్రంలోఅనేకసార్లు దరఖాస్తులు చేసుకునాన ఎటువంటి చర్యలు లేవని వాపోతున్నారు. పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలకు రేషన్ కార్డు అడుగుతున్నారని, అవి లేకపోవడంతో రేషన్‌తోపాటూ అమ్మ ఒడి ఇతర ప్రభుత్వ పథకాలు అందడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు రేషన్ కార్డులు మంజూరు చేయాలనికోరారు

రేషన్ కార్డులు కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు

పోలీసులు కూల్చిన గుంతలివే..

రహదారి గుంతల పూడ్చివేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని శరభవరం, దాకరాయి గ్రామాల మధ్యలో ఇరుకు వంతెన వద్ద ప్రధాన రహదారి గోతులతో ప్రమాద భరితంగా ఉండడంతో రాజవొమ్మంగి పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ టీజీ నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మంగళవారం ఆ గోతులను పూడ్చారు. రహదారి మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్న దృష్ట్యా నరేంద్ర ప్రసాద్ విషయం తెలుసుకొని జెసిబి సహాయంతో గోతులలో గ్రావెల్ మెటల్ వేసి పూడ్చారు. ఈ సందర్భంగా పోలీసులను పలువురు వాహనదారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పాడేరు : వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా గిరిజన యువతకు వారికి నచ్చిన వృత్తిలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందుటకు ఈనెల 20లోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హులైన గిరిజన యువకులను గుర్తించి ఐటిడిఎ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. పాడేరు ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల నిరుద్యోగ గిరిజన యువత వృత్తి కోర్సుల్లో శిక్షణ పొందుటకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు జి.కే.వీధి, చింతపల్లి, ముంచింగిపుట్, పేట జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, మండలాల్లోనిమారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన యువకుల నుంచి ముఖ్యంగా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే గిరిజన యువకులు తమ పేరు, తండ్రిపేరు, గ్రామం, పంచాయతీ, మండలము, గిరిజన తెగలో ఉప కులము, వయస్సు, విద్యార్హత, ఆధార్ నెంబరు, మొబైల్ నెంబర్, ఏవృత్తి కోర్సులో శిక్షణ పొందదలిచారో వివరంగా దరఖాస్తులో పేర్కొన్నాలని సూచించారు. టైలరింగ్, నిర్మాణం, పర్యాటక ఆతిథ్యం, ప్లంబింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమోటివ్, సెక్యూరిటీ గార్డ్, తాపీ పని మొదలైన వృత్తులకు సంబంధించి శిక్షణకు సంబంధిత మండలాల ఎంపిడిఒలకు ఈ నెల20లోగా దరఖాస్తులను అందజేయాలని పిఒ ప్రకటనలో కోరారు.

శరవేగంగా విశాఖ అభివృద్ధి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటని నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బివిఆర్.సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం ఉదయం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ సమావేశంలో జివిఎంసి, విఎంఆర్‌డిఎ, పరిశ్రమల శాఖ అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీతి ఆయోగ్ ఫైలెట్ సిటీలుగా ముంబయి, సూరత్, విశాఖపట్నం, వారణాసిలను గుర్తించిందన్నారు. విశాఖ జిల్లాలో సహజ వనరులతో పాటు రైల్వే, పోర్టు కనెక్టవిటీ అభివృద్ధికి దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా విజన్ ఫర్ ఆంధ్రప్రదేశ్, సిటీ డెవలప్‌మెంట్ ప్లానింగ్‌పై పలు విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ విశాఖ జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కోస్టల్ సిటీ, సర్వీసు సెక్టార్, టూరిజం, సిటీ ప్లానింగ్, యుసిడి, ఎడ్యుకేషన్, పబ్లిక్ హెల్త్, ఈ గవర్నెన్స్ తదితర అంశాలపై సాధించిన ప్రగతిని వివరించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా బీచ్ రోడ్డులో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు అమర్చామన్నారు. జిల్లాలో స్టీల్‌ప్లాంట్, కోరమండల్, బిహెచ్‌పివి, హెచ్‌పిసిఎల్ వంటి పరిశ్రమల గురించి వివరించారు. జిల్లాలోని విద్యాలయాల పరిస్థితిని తెలియజేశారు.

కార్పొరేట్లతో అడవులు నాశనం

ఆదివాసీ జాతీయ సభలో వక్తలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ అండదండలతో కార్పొరేట్ శక్తులు అడవిని నాశనం చేస్తున్నాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐకెఎంకెఎస్ ఆధ్వర్యంలో అఖిల భారత ఆదివాసీ సభ మంగళవారం సాయంత్రం ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో జరిగింది. రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, ఎఐఎఫ్‌టియు న్యూ అధ్యక్షులు గుర్రం విజయ్ కుమార్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య తదితరులు మాట్లాడారు. మరో 8 మాసాలలో పార్లమెంటుకు ఎన్నికలు జరగబోతున్న వేళ ఆదివాసుల మనుగడను ప్రశ్నార్థకం చేసేలా అటవీ సంరక్షణ చట్టానికి సవరణలు చేయటాన్ని బరితెగించిన చర్యగా పేర్కొన్నారు. ఎవరికివారు విడివిడిగా పోరాటం చేయటం కాకుండా ఆదివాసీలు, కార్మికులు, రైతులు కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. ఎఐకెఎంకెఎస్ కో కన్వీనర్ ఝాన్సీ మాట్లాడుతూ 15 సంవత్సరాల కాలంలో ఏడు లక్షలా 50 వేల ఎకరాల అటవీ భూములను అటవీయేతర కార్యక్రమాలకు పాలకులు కేటాయించారని, 9 లక్షల ఎకరాల అటవీ భూములు దురాక్రమణకు గురయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎఫ్‌టియు న్యూ రాష్ట్ర కార్యదర్శి జై.కిషోర్ బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గణేష్ పాండా, కొండమదులు సర్పంచ్ వేట్ల విజయ, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కొంచెం రామారావు, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దుకై ఉద్యమిద్దాం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన అటవీ సంరక్షణ చట్ట సవరణను రద్దు చేయాలని ప్రముఖ పర్యావరణ ఉద్యమ నాయకులు ప్రఫుల్ల సమంత రాయ్ (ఒడిశా) డిమాండ్ చేశారు. రెండు రోజులపాటు డాక్టర్ బిడి.శర్మ ప్రాంగణం (సుబ్బలక్ష్మి కళ్యాణ మండపం)లో ఎఐకెఎంకెఎస్ ఆధ్వర్యంలో జరిగే అఖిలభారత ఆదివాసీ సదస్సులో మంగళవారం ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. అటవీ ప్రాంతాల్లోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లు, బహుళ జాతి కంపెనీలు కొల్లగొట్టేందుకు వీలుగా కేంద్ర పాలకులు ఇటీవల అటవీ చట్టంలో సవరణలు చేశారన్నారు. 1996, 2004 సంవత్సరాల నాటి చట్టాలకు కూడా పాలకులు తూట్లు పొడిచి ఆదివాసుల హక్కులను కాలరాసారన్నారు. ప్రారంభ సభలో ఆదివాసీ ఉద్యమ నేత, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, ఎఐకెఎంకెఎస్ (బీహార్) నేత అశోక్ బైతా, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, ఆదివాసీ ఉద్యమకారులు అజయ్ కుమార్, విశాఖ స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ తదితరులు సౌహార్ధ సందేశాలిచ్చారు.

అభివాదం చేస్తున్న నాయకులు

దిద్దుబాటు, సంస్కరణలు అవసరం

మహిళా ఖైదీలకు ప్రత్యేక కారాగారాలు ఉండాలి
జైళ్ల ఉన్నతాధికారుల జాతీయ సదస్సులో పలువురు ఉద్ఘాటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జైళ్లలో ఖైదీలకు మౌలిక వసతులు, సంక్షేమం, ఆరోగ్యం, సాంస్కృతిక వికాసం, పునరావాసం వంటి ప్రాథమిక హక్కులపై పలు రాష్ట్రాలకు చెందిన జైళ్ల శాఖల డిజిలు, ఐజిలు, జైళ్ల సూపరింటెండెంట్ స్థాయి ఉన్నతాధికారుల పేనల్ కమిటీలు గొంతెత్తాయి. విశాఖలోని రుషికొండ సాయిప్రియా రిసార్ట్స్‌లో ఈ నెల 11న ప్రారంభమైన 'రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల జైళ్ల ఉన్నతాధికారుల జాతీయ సదస్సు' మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఈ సదస్సు విజయవంతంగా సాగింది. ముగింపు రోజైన మంగళవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. కక్ష సాధించడం కోసం శిక్ష ఉండకూడదని, నేరానికే గుణపాఠంలా.. నేరస్తున్ని సంస్కరించే విధంగా జరిమానా లేదా శిక్ష ఉండాలని ఆయన ఉద్ఘాటించారు.

మహిళలకు ప్రత్యేక జైళ్లు

ప్రత్యేక జైళ్లతోనే మహిళా ఖైదీల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పలు రాష్ట్రాలకు చెందిన జైళ్ల మహిళా ఉన్నతాధికారులు తెలిపారు. రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల జైళ్లలో మహిళలు నిర్లక్ష్యానికి గురౌతున్నారని, వారి పిల్లలు అనాథులుగా మారి పునరావాసానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగిన 'ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఇంప్రిజన్‌మెంట్ మెరిట్స్ అండ్ ఛాలెంజెస్' అన్న అంశంపై పేనల్ చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ జైళ్ల శాఖకు చెందిన సూపరింటెండెంట్ సెఫాలీ దివారీ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో మహిళా ఖైదీలు జైళ్లలో అష్టకష్టాలు, లైంగిక వేధింపులకు గురౌతున్నారని ఆవేదన చెందారు. ప్రత్యేక జైళ్లే మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, పునరావాసం వంటి సమస్యలకు పరిష్కారమన్నారు. ఖైదు చేయబడిన వారిలో గృహిణులే అత్యధికంగా ఉన్నారన్నారు. వీరిలో 50 శాతం గ్రామీణ ప్రాంతాల నుంచే జైళ్లలోకి నెట్టబడుతున్నారన్నారు. బాత్ రూమ్‌లు, టాయ్‌లెట్‌లు, ఒకే గేటు ద్వారా వెళ్లి రావడం వంటి పరిస్థితులు దేశంలోని జైళ్లలో 79 శాతం ఉండడం దురదృష్టకరమన్నారు. ముఖ్యంగా 60 శాతం బాత్‌రూమ్‌లను పురుషులు, మహిళలు ఆయా జైళ్లలో వినియోగిస్తున్న దుస్థితి నేటికీ ఉందన్నారు. 2023 మోడల్ జైళ్ల సంస్కరణలు ఈ పరిస్థితులను కొంతైనా మార్చితే తప్ప మహిళలకు రక్షణ లేదన్నారు.

మహిళా ఖైదీల పిల్లల బాధ్యత ప్రభుత్వాలకు పట్టాలి

మహిళా ఖైదీల పిల్లలను సమాజం సరైన దృష్టితో చూసే పరిస్థితులూ ఎక్కడా లేవని, వారి చదువు, సంక్షేమం, ఆట, పాట, తల్లి పునరావాసం వంటి అంశాలను జైళ్ల పరిపాలనలో సరిదిద్దే సంస్కరణలు దేశంలోని అన్ని జైళ్లలోనూ రావాలని ఆకాంక్షించారు. చాలా రాష్ట్రాల్లో మహిళా ఖైదీల పిల్లలకు స్కూళ్లలో అడ్మిషన్స్ ఇవ్వడం లేదన్న విషయం పంజాబ్, యుపి, గుజరాత్, హర్యానా, చండీఘర్ రాష్ట్రాల్లో నిర్వహించిన సర్వేలో వెల్లడైందన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న నాయకులు

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి వాల్మీకి నగర్‌లో తాటాకు ఇల్లు దగ్ధమై రూ50 వేలు ఆస్తి నష్టం సంభవించింది. వివరాలు ఇలా ఉన్నాయి... జడ్డంగి పంచాయతీ వాల్మీకి నగర్లో బిత్తర వెంకయ్యమ్మ అనే వృద్ధురాలకు చెందిన తాటాకు ఇంట్లో మంగళవారం సాయంత్రం టీ పెట్టుకోవడానికి పొయ్యి వెలిగించగా అకస్మాత్తుగా మంటలు ఇంటి తాటాకులకు అంటుకొని మంటలు ఇల్లంతా వ్యాపించాయి. దీంతో బాధితురాల ఆమె బయటకు పరుగులు తీసింది. ఇది గమనించిన చుట్టుపక్కల ఉన్న యువకులు మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఇల్లు పూర్తిగా కాలిపోయింది, అగ్నిప్రమాదంలో వద్ధురాలుకు చెందిన 10వేలు నగదు, ఆధార్, రేషన్ కార్డులు, ఇతర పత్రాలు, బట్టలు, ఇతర సామాగ్రి కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్ఐ ఎంఎస్ఎన్ రాజు, సిబ్బంది, వీఆర్వో మానాజీ, గ్రామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, వార్డ్ మెంబర్లు సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ శాఖ వారికి సమాచారం అందించగా, విద్యుత్ లైన్ కనెక్షన్ తప్పించారు. వద్ధురాలకు ప్రభుత్వ తక్షణ సాయం కింద 25 కేజీల బియ్యం, పంచదార, నిత్యవసర సరుకులు అందించారు. సర్పంచ్ కొంగర మురళీకృష్ణ వెయ్యి రూపాయల నగదు, నిత్యవసర సరుకులు అందజేశారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ దృష్టికి తీసుకువెళ్లి మరింత ఆర్థిక సహాయం వచ్చేలా కృషి చేస్తామని సర్పంచ్ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎం సత్తిబాబు, ఎం బాబురావు, ఎం ప్రశాంతి, డి శ్రీను, జడ్డంగి వాల్మీకి నగర్ యువకులు పాల్గొన్నారు.

ప్రధాన ఓడరేవులలో విశాఖ పోర్టుకు మూడో ర్యాంకు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై కాలానికి ప్రధాన ఓడరేవులలో విశాఖ పోర్టు అథారిటీ మూడో ర్యాంకు సాధించినట్టు ఉన్నతాధికారులు వెల్లడించారు. దేశంలోని అన్ని ప్రధాన పోర్టుల పనితీరును పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి మంగళవారం సమీక్షించి ఈ నిర్ణయాన్ని ప్రకటించారన్నారు. కార్గో వాల్యూమ్, పిబిడి, టర్న్ రౌండ్ టైమ్, ఒఎస్‌బిడి, తదితర విభాగాల్లో విశాఖ పోర్టు మంచి ప్రగతి కనబరిచినట్టు తెలిపారు. 33.14 మిలియన్ టన్నులను హ్యాండిల్ చేయడం ద్వారా ఓడరేవు కార్గో పరిమాణంలో మంచి మెరుగుదలను చూపిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే పిబిడి, టిఆర్‌టిలలో 16 శాతం, ఒఎస్‌బిడిలో 14 శాతం మెరుగుదల కనిపించిందన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - అనంతగిరి : బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, కిశోర బాలికలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి. అచ్యుతాంబ, లుంగపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దివ్య కోరారు మంగళవారం మండలంలోని అంగన్వాడీలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతోపాటు అందుబాటులో ఉండే పప్పు దినుసులు, ఆకుకూరలు, మాంస పదార్థాలు, ప్రోటీన్లతో కూడిన కూరగాయలు తినాలని, తద్వారా గర్భిణులతోపాటు వారికి పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్, ఆసుపత్రి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

చంద్రబాబు అరెస్టు దారుణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు జగన్ ప్రభుత్వ అణచివేతలో భాగమేనని జనసేన పిఎసి సభ్యుడు కోన తాతారావు, నాయకులు పంచకర్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. హోటల్ మేఘాలయాలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.